రోడ్డు పూర్తయ్యేదెప్పుడో?

- రెండేళ్లుగా పనుల్లో తీవ్ర జాప్యం
- వర్షాలకు బురదమయం
- ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు


దేగాం గ్రామం వద్ద కొనసాగుతున్న పనులు

భైంసారూరల్: భైంసా–బోధన్ జాతీయ రహదారి పనులు కొనసాగుతూనే ఉన్నాయి. దేగాం వద్ద గత రెండేళ్లుగా పనులు సాగుతున్నాయి. పనుల్లో తీవ్ర జాప్యం కారణంగా నిత్యం వాహనదారులు, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం కురిస్తే చాలు బురదగా మారి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఇటీవల ఈ రోడ్డుపై భైంసా పట్టణానికి చెందిన వాస్తార్ సాయినాథ్ బాసరకు యూరియా మందుల లోడ్‌తో ప్రమాదానికి గురై సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. హరియాలీ పెట్రోల్ బంక్ వద్ద వారంలో రెండుసార్లు ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. అయినా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దేగాం సమీపంలో ద్విచక్రవాహనదారులు కిందపడిపోతున్నారు. దేగాం గ్రామంలో సాయిబాబా ఆలయం నుంచి బడ్‌గాం గ్రామం వరకు జరుగుతున్న పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. తరచూ ఏదో ఒక కారణంతో పనులు నిలిచిపోతున్నాయి. ఈ విషయంలో సంబంధిత కాంట్రాక్టరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో రాకపోకలు సాగించే గ్రామస్తులు గత రెండు నెలలుగా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి పనుల్లో వేగం పెంచేలా చర్యలు చేపట్టాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం

రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండేళ్లుగా దుమ్ము, ధూళితో ఇబ్బంది పడాల్సి వస్తుంది. పనులు పూర్తిచేసేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– గంగాధర్, దేగాం ప్రయాణికుడు

పట్టించుకోవడం లేదు

గత రెండేళ్లుగా రోడ్డు పనుల పేరిట తీవ్ర జాప్యం జరుగుతోంది. త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వర్షం పడితే బురదగా మారి వాహనాలు కూరుకుపోతున్నాయి.

– రమేశ్, ఇలేగాం ప్రయాణికుడు

క్లుప్తంగా

జనరల్ ఆసుపత్రిని సందర్శించిన మాజీమంత్రి


వైద్యుడిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సోమవారం మాజీమంత్రి, కాంగ్రెస్ నేత ఇంద్రకరణ్‌రెడ్డి సందర్శించారు. ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాద ఘటన నేపథ్యంలో సందర్శించి వైద్యులతో మాట్లాడారు. షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగిన విషయాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వీరితోపాటు అల్లోల మురళీధర్‌రెడ్డి, మేడారం ప్రదీప్, వెంకటరాంరెడ్డి, శ్రీకాంత్ యాదవ్, గంగారెడ్డి, మహిపాల్‌రెడ్డి, పీవీ రమణారెడ్డి ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తానూరు: మండల మొట్టమొదటి మాజీ ఎంపీపీ, సింగన్‌గాం గ్రామానికి చెందిన జాదవ్ గంగాధర్ పటేల్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. బాధిత కుటుంబాన్ని మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. నాయకులు బాశెట్టి రాజన్న, పోతారెడ్డి, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.
సోన్: కడ్తాల్ గ్రామంలో ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందిన గుర్రం గంగన్న, కొత్తగొల్ల మల్లవ్వ కుటుంబాలను ఉమ్మడి నిర్మల్ మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు సత్యానారాయణగౌడ్ సోమవారం పరామర్శించారు. రాజనర్సయ్య, గంగాదాస్, బీజేపీ నాయకులు మేకల అశోక్, నర్సయ్య ఉన్నారు.

తైక్వాండో రాష్ట్ర పరిశీలకుడిగా రామారావు


రామారావు

ఖానాపూర్: జోగులాంబ గద్వాలలో ఈనెల 23 నుంచి 25 వరకు జరిగే 68వ రాష్ట్రస్థాయి అండర్ 17 బాలబాలికల తైక్వాండో పోటీల రాష్ట్ర పరిశీలకుడిగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రాంరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషిచేసిన వారికి రామారావు కృతజ్ఞతలు తెలిపారు.

హిందూ ఆలయాలను కాపాడాలి


ఫిర్యాదు చేస్తున్న కార్యకర్తలు

లోకేశ్వరం: హిందూ ఆలయాలను కాపాడాలని విశ్వహిందూ పరిషత్, హిందూ వాహిని కార్యకర్తలు కోరారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్, సికింద్రాబాద్‌లో వారం వ్యవధిలో హిందూ దేవాలయాల విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. హిందూ ఆలయాలకు రక్షణ కల్పించాలని కోరారు. నాగేష్, పాల గంగాధర్, శ్రీనివాస్, రవీంద్రచారి, శ్రీనివాస్‌రావు, సాయినాథ్, బట్టు ధర్మన్న, గంగాధర్ ఉన్నారు.

పాఠశాల సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వీడీసీ నాయకులు, ఉపాధ్యాయులు కోరారు. జిల్లాకేంద్రంలోని గ్రీవెన్స్‌లో సోమవారం ఈ మేరకు కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిశారు. పాఠశాలలో కొత్త టీచర్ పోస్టులతోపాటు మౌలిక సదుపాయాలపై విన్నవించారు. భీమన్న, దయానంద్, రాజిరెడ్డి, గజేందర్, మహిపాల్, వెంకట్రాములు, శివ, హెచ్‌ఎం నరేందర్‌రావు తదితరులు ఉన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ భూముల్లో సర్వే

మామడ: మండల కేంద్రంలో సోమవారం ఎల్‌ఆర్‌ఎస్ భూముల్లో అధికారులు సర్వే నిర్వహించారు. రెవెన్యూ, ఇరిగేషన్, మండల పరిషత్ అధికారులు ఆయా దరఖాస్తులను పరిశీలించి వివరాలు నమోదు చేశారు. మండలంలో ఎల్‌ఆర్‌ఎస్‌కు 62 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రెండు దశల్లో సర్వే నిర్వహించి వివరాలను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఎంపీడీవో గంగాసాగర్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ ఏఈ విఠల్, మామడ పంచాయతీ కార్యదర్శి మహేందర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- ఎమ్మెల్యే రామారావు పటేల్


లోకేశ్వరం: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

లోకేశ్వరం: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. మండలంలోని నర్సింహానగర్ తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించి ధాన్యం ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. ప్రభుత్వం ఏగ్రేడ్‌కు రూ.2320, బీ గ్రేడ్‌కు రూ.2300 ధర చెల్లిస్తోందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. నాయకులు రాజేష్‌బాబు, గన్ను వెంకట్‌రెడ్డి, భీంరావు, ఉత్తంలు ఉన్నారు.
ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రామరావు పాటిల్ సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యం విక్రయించాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, వైస్ చైర్మన్ సాయిరాం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్‌బాబు, పీఏసీఎస్ డైరెక్టర్లు ధర్మపురి సుదర్శన్, సురేందర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు ధర్మపురి శ్రీనివాస్, దత్తాత్రేయ, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

‘తులం బంగారం హామీ ఏమైంది?’

లోకేశ్వరం: కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా అదనంగా తులం బంగారం ఇస్తానని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ ఏమైందని ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రశ్నించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 124 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయంపై ప్రస్తావించి తులం బంగారం ఇచ్చేవరకు పోరాడుతానన్నారు. రైతుబంధు, రూ.2 లక్షల రుణమాఫీ నేటివరకు ఇవ్వలేదన్నారు. అదేవిధంగా పంచగుడి నుంచి ముధోల్ వరకు చేపట్టిన రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తానన్నారు. తహసీల్దార్ మోతీరాం, నాయకులు రత్నాకర్‌రావు, రాజేష్‌బాబు, గన్ను వెంకట్‌రెడ్డి, శ్రీధర్, లక్ష్మణ్‌రావు, భాస్కర్, సరస్వతి, సాహెందర్, భోజన్న, మహేందర్‌రెడ్డి, గంగారెడ్డి, శంకర్‌గౌడ్, పోతన్న, నల్ల రమేశ్, ఆనంద్‌రావు పటేల్, గంజాల గంగాధర్, మంద గణేశ్, పోతన్న, భూమన్న, విలాస్, జీవన్, అనిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న డీఎస్పీ

ఖానాపూర్: విధి నిర్వహణలో వీరమరణం పొంది ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. పట్టణంలోని ఖానాపూర్ సర్కిల్ కార్యాలయంలో పోలీసు అమరవీరుల స్తూపం వద్ద సోమవారం సంస్మరణ దినోత్సవం సందర్భంగా నివాళులర్పించారు. ఖానాపూర్ సర్కిల్ పరిధిలో జరిగిన నక్సలైట్ల కాల్పుల్లో 19 మంది పోలీసులు అమరులయ్యారని అన్నారు. వీరమరణం పొందిన అమరుల ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. సీఐ సైదారావు, ఎస్సైలు రాహుల్ గైక్వాడ్, రుక్మవార్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ ఆవరణలో చెత్త తొలగింపు

సాక్షి స్పందన


బస్టాండ్ వెనుకభాగంలో చెత్త తొలగిస్తున్న సిబ్బంది

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పారిశుధ్య నిర్వహణ లోపంపై ‘అధ్వానంగా భైంసా బస్టాండ్’ శీర్షికన ‘సాక్షి’లో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు డీఎం హరిప్రసాద్ ఆదేశాల మేరకు సోమవారం బస్టాండ్ ఆవరణలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. బస్టాండ్ వెనుక చెత్తాచెదారం తొలగించారు. అలాగే బస్టాండ్ ప్రవేశమార్గంలో వాహనాల అస్తవ్యస్త పార్కింగ్, డ్రెయినేజీ మరమ్మతులపై చర్యలు తీసుకుంటున్నట్లు స్టేషన్ మేనేజర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కొండముచ్చుకు అంత్యక్రియలు


అంత్యక్రియలు చేస్తున్న కార్మికులు

ముధోల్: మండల కేంద్రంలో సోమవారం కొండముచ్చుకు అంత్యక్రియలు నిర్వహించారు. బస్టాండ్ సమీపాన నిర్మాణదశలో ఉన్న భవనం పక్కన కొండముచ్చు ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. భవన నిర్మాణ కార్మికులు గమనించి కొండముచ్చుకు సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు.

అమ్మవారికి సారె సమర్పణ


అమ్మవారికి సారెను సమర్పిస్తున్న భక్తులు

ఖానాపూర్: మనసారె–మనసారా–మన అమ్మకు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో శైవక్షేత్ర వనితశక్తి ఖానాపూర్ శాఖ ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. అర్చకుడు చక్రపాణి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో పూజలు చేశారు. కార్యక్రమంలో మాధవి, గీతారాణి, సరిత, స్వప్న, వాణి, వనిత తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏఎంసీ డైరెక్టర్లు

సారంగపూర్: సారంగాపూర్ ఏఎంసీ కార్యదర్శి దూమ్యానాయక్ ఆధ్వర్యంలో ఇద్దరు డైరెక్టర్లు కొత్త కాపు పోతారెడ్డి, అహ్మద్ ముక్తార్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం చైర్మన్ అబ్దుల్ హాదీ, వైస్ చైర్మన్ లక్కడి శంకర్‌రెడ్డిలు వారిని సన్మానించారు. తర్వాత మార్కెట్ అభివృద్ధిపై చర్చించారు. సోయా కొనుగోళ్లు వేగవంతం చేయడంతోపాటు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు గురించి మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు నిర్వహించేలా చర్యలు చేపడుతామన్నారు. నాయకులు సురేందర్, షేక్ షఫీ, బట్టు భోజన్న, రాందాస్ ఉన్నారు.

ప్రజావాణిలో ఒకే దరఖాస్తు


దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్

కుంటాల: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఇందులో ఒకే దరఖాస్తు వచ్చిందని అధికారులు తెలిపారు. కుంటాలకు చెందిన తెడ్డు రమేశ్.. జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేశానని, తనకు ఉద్యోగం ఇప్పించాలని దరఖాస్తు అందించారు. తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఏ రహీం, డీటీ నరేశ్‌గౌడ్, ఏపీఎం అశోక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

మామడ: మండలంలోని పొన్కల్ పశువైద్యాధికారిగా మహ్మద్ అబ్దుల్ శహ్రీయార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన్ను వీడీసీ ఆధ్వర్యంలో సన్మానించారు. మామడ పశువైద్యాధికారి మహేశ్, వీడీసీ చైర్మన్ కొరిపెల్లి సుధాకర్ రెడ్డి, నాయకులు రాజారెడ్డి, గంగయ్య, రమేశ్, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.
దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేట గ్రామంలోని పశువైద్యాధికారిగా సంధ్యారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది ఉన్నారు.


గోదాం వద్ద వేచి ఉన్న రైతులు

ఎరువుల కోసం నిరీక్షణ



ముధోల్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో బాసరకు వారం రోజులుగా యూరియా, డీఏపీ ఎరువులు ఇవ్వడం లేదు. దీంతో రైతులు రోజు గోదాం వద్దకు వచ్చి వెళ్తున్నారు. సోమవారం కూడా ఎరువులు వచ్చాయనితెలుసుకున్న రైతులు ఉదయం 4 గంటలకే క్యూ కట్టారు. ప్రస్తుతం శనగ పంటకు డీఏపీ, వరి, పత్తి పంటలకు యూరియా అవసరమని తెలిపారు. స్థానికంగా ఎరువులు లేకపోవడంతో మహారాష్ట్ర నుంచి ఎక్కువ ధరకు తెచ్చుకుంటున్నామని తెలిపారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాల్సిన సొసైటీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. - బాసర

పడమటి సింధూరం



లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ సమీపంలో సోమవారం సాయంత్రం అద్భుతం ఆవిష్కృతమైంది. సూర్యుడు చుట్టూ ఎరుపురంగు పులుముకున్నట్లు ఉండటంతో అద్భుత దృశ్యం ఏర్పడింది. ఆ సమయంలో ఆకాశం ఇట్టే ఆకట్టుకుంది.

ప్రొసీడింగ్ అందజేత

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లిలో ఈద్గా ప్రహరీ, బూరుగుపల్లి (జి) గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణాలకు చెరో రూ.1.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తన నివాసంలో సోమవారం నాయకులకు ప్రొసీడింగ్ అందజేశారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి సీతక్క, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మక్బుల్, గోస్కుల భూమయ్య, కళ్యాణ్ కర్ ప్రవీణ్ పాటిల్, మాజీద్, సాయిలు ఉన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఖానాపూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన విద్యార్థులు, నిరుద్యోగులతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎంపీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు రత్నాకర్‌రావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కౌంటర్‌లో సోమవారం ఓటరుగా నమోదు చేసుకున్నారు. అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.

రికార్డుల తనిఖీ

నర్సాపూర్(జి): తహసీల్దార్ కార్యాలయంలో ఆర్టీఐ సామాజిక కార్యకర్తలు సయ్యద్ కలీం, ముష్కం సుదర్శన్‌గౌడ్, నరేశ్ సోమవారం రికార్డులను తనిఖీ చేశారు. గత ఎనిమిది నెలలుగా కార్యాలయంలో జారీచేసిన అగ్రికల్చర్, ఆదాయ సర్టిఫికెట్స్, పట్టా మార్పిడి చేసిన ఫామ్–7, ధరణి అప్లికేషన్ వివరాల రికార్డులను తనిఖీ చేశారు. సామాజిక కార్యకర్త సయ్యద్ కలీం మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సామాన్య ప్రజలకు వజ్రాయుధం లాంటిదని, దీనిని ఉపయోగించి ప్రతి పౌరుడు ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తు చేసి వివరాలు పొందవచ్చునని తెలిపారు. పౌర సమాచార అధికారి ,డీటీ వాహిదొద్దీన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నోట్‌బుక్‌లు, పెన్నుల పంపిణీ


నోట్‌బుక్స్‌తో విద్యార్థులు

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన భుక్యా రమేశ్ సోమవారం నోట్‌బుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు తనవంతుగా వీటిని అందించినట్లు రమేశ్ తెలిపారు. మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న, టీచర్ రాజేందర్, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, ప్రభాకర్, నరేశ్ తదితరులు ఉన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

కడెం: భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ధర్మాజీపేట్ చెందిన పలువురు గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని ధర్మాజీపేట్ గ్రామానికి చెందిన కొందరు సర్వే నంబర్ 214లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. ఆ భూమికి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

నిర్మల్‌రూరల్: మండలంలోని తల్వేద గ్రామంలో సోమవారం విద్యుత్ షాక్‌తో గేదె మృతిచెందింది. మేత కోసం పక్కనే ఉన్న పొలంలోకి గేదె వెళ్లగా అక్కడ ఎల్‌టీ లైన్ తెగిన విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ రూ. 50 వేలు ఉంటుందని బాధిత రైతు రేగుంట రాజన్న తెలిపాడు. విద్యుత్ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

ఆటాపాటలతో విద్యానందించాలి

తానూరు: అంగన్‌వాడీ చిన్నారులకు ఆటాపాటలతో విద్యనందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత సూచించారు. మండల కేంద్రంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల వివరాలను సేకరించారు. చిన్నారులు, గర్భిణులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ అనిత, సిబ్బంది తదితరులు ఉన్నారు.

‘సీఎంపై అసత్య ఆరోపణలు మానుకోవాలి’

ఖానాపూర్: గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో వెనుకబడ్డ తెలంగాణ పునర్నిర్మాణానికి పాటుపడుతున్న సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. కేసీఆర్ పాలనలో సాధ్యం కాని ఎన్నో హామీలను రాష్ట్రప్రభుత్వం పది నెలల్లో చేస్తోందన్నారు.

విద్యార్థులకు అభినందన

కడెం: జిల్లా కేంద్రంలో ఈనెల 19న జరిగిన కళోత్సవ్ కార్యక్రమంలో నృత్యం, పాటలు, పెయింటింగ్, విభాగాల్లో మండలంలోని లింగాపూర్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. సోమవారం వారిని హెచ్‌ఎంను వెంకటరమణ, ఉపాధ్యాయులు అభినందించారు.

27న పథసంచలన్

ఖానాపూర్: పట్టణంలోని ఖానాపూర్ ఖండ కేంద్రలో విజయదశమి ఉత్సవ పథ సంచలన్(సంఘ ర్యాలీ) ఈ నెల 27న ఉంటుందని ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు శ్రావణ్, ప్రభాకర్, సాంకేత్, భీమేష్, రాజేశ్వర్ తెలిపారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తూరాబాద్ మండలాల్లోని ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు, వివిధ క్షేత్రాల కార్యకర్తలు సంఘ యూనిఫాంతో పాల్గొనాలని కోరారు. వివరాలకు సెల్ 9493474621 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా భీమన్న జాతర


ఊరేగింపులో భక్తులు

మామడ: మండలంలోని కొరిటికల్ భీమన్న స్వామి జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని స్వామివారి ఉత్సవ విగ్రహాలను గోదావరి నదిలో స్నానమాచరింపజేసిన అనంతరం భక్తులు ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం ఆలయంలో భీమన్నస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వర్షం కారణంగా జాతర ఉత్సవాలకు కొద్దిసేపు అంతరాయం కలిగింది. తర్వాత భక్తులు దర్శించుకున్నారు.